# "వికీర్ణ కుసుమ దళ—"

## వడ్లపట్ల దయానందం

అసలు సహజంగానే అందంగా ఉండే, ఆ అమ్మాయి అందానికి విశేషించి ఆ అబ్బాయి దృష్టిలో అంతే లేదు.

లేతాకుపచ్చ చీరకట్టి, తెల్లని జాకెట్ వేసుకుని, నల్లటి కనుబొమలకి మధ్యగా కాస్త పైన చిన్న గంధపు బొట్టుంచుకుని బహు ముద్దుగా కన్పించిందీరోజున. మెడలో మెరుస్తున్న ఒంటి రాయివరస నెక్లెస్ లాంటిది, మధ్య కాంతులతో మెరిసిపోతున్న ఎర్రటి కెంపుతో... ఆ అందమైన ముఖానికి మరికాస్త అదనపు అందాన్ని తెచ్చి పెట్టింది.

ఆ ముఖంలోకే కాసేపు తేరపారచూసి, దృష్టిని కిటికీలోనించి బయటికి పోనిచ్చి ... దూరాన ఎక్కడో మేఘాలతో ఆడుకుంటున్న తాడిచెట్ల తలలమీద వదిలేసి—

"మిస్ లీలా ... మిమ్మల్ని నే ప్రేమించ వచ్చునా?" నెమ్మదిగా అడిగాడు రమణరావ్.

ఈ మాట అడిగి వెంటనే పూర్వస్థానంనుంచి దృష్టి ఉపసంహరించుకుని, లీల ముఖంమీదికే తిరిగిపోనిచ్చాడు. ముఖాన్నిబట్టి మదిలో మెదిలే భావాలేమిటో, దాదాపు ఎనభై పాళ్ళవరకు గ్రహించగల మహత్తర శక్తి రమణరావుకుంది. అందువల్లే లీల సమాధానం చెప్పకముందే ముఖ భావాల్ని గ్రహించి ఇలా అనుకున్నాడు.

"అదేమిటీ ప్రేమ అన్నదాన్ని ఎప్పుడూ ఎరగని దానిలా అలా విస్మయపడుతోంది! పదహారో పడిలో పడి ఇంటర్ చదువుతూన్న ఈ లీలకి, ప్రేమన్నది తెలియకపోవడం నిజంగానే లీలగా ఉన్నదే!" అనుకుంటూ సమాధానం రాకముందే రమణరావే ఆశ్చర్యపోవడం మొదలెట్టాడు.

లీల విశాల నయనాల తాలూకు నల్లటి స్ఫుట మైన కనుపాపలు, అమాయకంగా రమణరావు ముఖాన్ని రెండుమూడుసార్లు చుట్టముట్టి, గదిమూల నున్న చిత్తుకాగితంమీద నిలచిపోయినై. అచేతనంగా అవలా నిలిచిపోగా, వణకుతూన్న ఎర్రటి పెదిమలతో మోము రవ్వంత క్రిందికివాల్చి...

"వద్దంటే మానేస్తారా? అయినా మీ స్వంత విషయాల్నిగురించి శాసించడానికి నాకేం అధికారముంది? మీరు రోజూ ఆఫీసుకెడతారు. సాయంకాలంపూట నిత్యం బాట్‌మింటన్ ఆడుతారు. తరచూ సినిమాలకెడతారు. రోజుకొకసారైనా అన్నయ్యకోసం మా యింటికి వొస్తూంటారు. ఏ పార్కుకో వెడుతూంటారు. మీ అభిరుచుల కనుగుణంగా నడుచుకుపోవడానికి మీకేకాదు, మరెవ్వరికైనా అధికారముంది. 'నన్ను ప్రేమించడానికి మీ కధికారంలేదు' అనడానికి నేనెవర్ని?" అంది. అని, 'బహుశా' నేను సంతృప్తికరమైన సమాధానాన్నే ఇచ్చాననుకుంటా'—అన్నట్లు రమణరావు ముఖంలోకి చూచింది.

తెల్లబోయిన రమణరావ్ కళ్ళకి లీల కళ్లు కలవడంతోనే ఆర్కుదీపం లాంటిది కన్పించింది.

"ఈ కళ్ళల్లో ఇంతాకర్షణ ఎందుకుందబ్బా?" అనుకుంటూ, "అబ్బే నా ఉద్దేశం అదికాదు, అలాగయితే ఇప్పటికి నలభై రోజుల క్రితం తొలిసారిగా మిమ్మల్ని చూచినప్పట్నుంచే మీ ఇష్టాయిష్టాలతో నిమిత్తంలేకుండా నాతరఫున ప్రేమిస్తూనేఉన్నాను. నాభావం... నా ప్రేమని స్వీకరించి, తిరిగి ప్రేమించడానికి మీకేమైనా అభ్యంతరాలెందుకుండాలీ అని" అన్నాడు.

ఇది సంధ్యాసమయం. అంటే ఉదయం సంధ్యను కునేరు మళ్లా... సాయంసంధ్య.

తూర్పువైపుకు ముఖంపెట్టుకూర్చున్న రమణరావు వీపుమీద—పడమటివైపు మీది కిటికీలోంచి పడుతున్న ఎర్రటి, పలుచటి సూర్యకాంతి... అతని కెదురుగా కూర్చున్న లీల ముఖానికి, చెప్పటానికి వీలులేనంతటి శోభను పూస్తోంది. నొక్కుల జుత్తును ముడివేసి, ముడి అడుగునుంచి ఒక జానెడు పొడవున కేశాల్ని వీపుమీదికి వదలి పెట్టింది.

ముడిలో ఉన్న చిన్న సాగరం పాతకాలపు కొత్తదనాన్ని సూచిస్తోంది. పైపెచ్చు చక్కగా విడిచి ఉన్న మల్లెపూల చెండును ముడిపైన ముచ్చటగా ముడుచుకునుంది.

అసలు రమణరావుకి పువ్వులంటే చాలా ఇష్టం. అందులోనూ మల్లెలంటే మరీ మనసు. పైపెచ్చు సిగలోనివి... మీదుమిక్కిలి లీల ముడుచుకున్నవి కావడంవల్ల, ఆ పరిమళంలోనించి, నిజంగానే మత్తులాంటి ఓ కొత్త పదార్థాన్ని సైతం ఆఘ్రాణించేస్తున్నాడు.

"తిరిగి ప్రేమించడానికి మీకేమైనా అభ్యంతరాలెందుకుండాలి" అన్న రమణరావ్ ప్రశ్నకి...

"ఎందుకుండగూడదూ!" అన్న ముక్తసరి సమాధానం ఇచ్చి..."బహుశా ఈ సమాధానాలతో ఆయన్ని నొప్పిస్తున్నానేమో" అన్న శంకతో... అమాయకంగా అతని ముఖంలోకి చూస్తూనే లీల యిలా అన్నది—

"అసలు ప్రేమించుకోడాలు మన సంప్రదాయం కాదుకా...ముందు తల్లిదండ్రులు కుర్రవాడి స్థితిగతులు చూడటం ... తర్వాత అతన్ని పిల్లని చూచుకోడానికి ఆహ్వానించడం... అటుపైన మిగిలిన వ్యవహారాలు సంప్రదించుకుని, అన్నీ సక్రమంగా నేరవేరితే అప్పుడు పెండ్లి నిశ్చయం చేసుకోవడం...జరుగుతుంది. నా విషయంలోనూ ఇలానే జరుగుతోంది. ఇప్పటికిద్దరొచ్చి చూసుకున్నారు కూడాను. ఒకతను నాకే నచ్చలేదనుకోండి: మరొకతనికి నేను నచ్చినా, ఇతర వ్యవహారాలు ఓ పట్టాన తెగక అదీ తెగిపోయింది." ఈ మాటలనేసి, తన బాధ్యత తీరినట్లు భావించి గోళ్లు గిల్లుకుంటూ ఉండిపోయింది లీల.

"అబ్బే మీలాంటి విద్యావతికూడా అభ్యుదయ పథాన్న నడవకపోతే, అభ్యుదయ పథాలు దుమ్ముకొట్టుకు పోతాయ్. మీరు చెప్పింది చదువులేనివాళ్ళు చేసుకొనేపని ..మీరూ నేనూ కూడా చదువుకున్నవాళ్ళం ... మన సొంతపూచీలమీద ప్రేమించుకుని పెళ్ళిచేసుకోవడం మన విద్యుక్తధర్మం... అదే ఆరోగ్యదాయకం కూడాను... చూడండీ ప్రేమంటే మీకు అహామాషీగా కన్పిస్తున్నదేమో. అలా ఎప్పటికీ కాదు. ఇప్పుడు నేనున్నాననుకోండి...మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. అంటే యావత్ ప్రపంచాన్ని ఒకే రాజ్యంగా ఏర్పాటుచేసి దాని తాలూకూ ఖాళీ సింహాసనాన్నొకదరిన...మిమ్మల్ని మరొకదరిన పెట్టి ఈ రెంటిలో దేన్ని కోరుకుంటావ్ అని అడిగితే!"— అంటూ ఆగి గంభీరంగా పైకి చూచేడు ఏదో బ్రహ్మాండమైన సత్యాన్ని బయట పడేయబోతున్నవానిలా.

"అసలా రాజ్యాల నన్నింటిని ఒకే పాలనకి తీసుకురావడం ఎలా సాధ్యమౌతుందీ!" రమణరావ్ గాంభీర్యాన్ని వేళ్ళకంటా నరికి పారేస్తూ అమాయకంగా అడిగేసింది లీల.

"అబ్బే ఊహించుకోమంటున్నా ... అంతే. అట్టి పరిస్థితిలో 'నే' కోరుకుంటాను ... మీరే కావాలని. ఇలా ప్రపంచంలో మరొకరెవరూ మిమ్మల్ని కోరుకోనకపోవచ్చు. దీన్నిబట్టి నా దృష్టిలో మీకెంత విలువుందో బోధపడటంలా... మీ దృష్టిలోసైతం నా కంతటి విలువుండేపక్షంలో చూచుండీ ... లీలగారూ ... 'స్వర్గం'కోసం వేరే వెతుక్కోవలసిన పనిలా."

"ఏమో బాబూ మీకంత 'ఇది'గా ఉంటే

పాత్రుడుగారి

బాలసంజీవిని

[REGD.]

పిల్లల లివర్ & స్లీను వ్యాధులను నివారించును.

డాక్టరు పిళ్లా పాపయ్యపాత్రుడు అండ్ బ్రదర్స్

19 దక్షిణ మాడవీధి-మైలాపూరు
మదరాసు—4. ఫోన్ నెం. 71354

బ్రాంచి:—7, సారంగపాణికోవిల తూర్పువీధి
కుంభకోణము.

అన్ని మందుల షాపులలోను దొరుకును.

మీరు మాత్రం ప్రేమించుకోండి... నేనేం కాదనటం లేదుగా? నాకు మట్టుకు ఇప్పటి కప్పుడే ప్రేమించడానికి సావకాశం ఉండదు బాబూ" అంది లీల తమాషాగా బుంగమూతి పెడుతూ.

కొన్ని క్షణాలు దీర్ఘాలోచనల్లో పడ్డాడు రమణరావ్. బాధగా నాలుగు వైపులకి చూచాడు.

"మీరు నన్నర్థం చేసుకోవడంలా 'నే' పడుతున్న బాధ." అంటూ ఆగి బాధతో కూడుకున్న బారాటి నిట్టూర్పు నొకదాన్ని విడిచిపెట్టాడు.

"మొన్న గరల్స్ స్కూలు హెడ్ మిస్ట్రెస్‌కి పంపవలసిన కాగితాన్నొకదాన్ని టైపు చేయవలసి వచ్చింది..." ఏమండీ వింటున్నారా...అన్న హెచ్చరికతో బయటి కెక్కడికో పారిపోబోతున్న తల చూపుల్ని తన ముఖంమీద కట్టేసుకుని.

సరే చాలా జాగ్రత్తగానే టైపుచేశాను. ఆవిడసలే అసాధ్యురాలులెండి...పిల్లల సమాధాన పత్రాల్ని పరీక్షించినట్లు పరీక్షించుతూ ఉంటుంది. దీనిలో సైతం సున్నితమైన దోషాల్ని ఎన్నిటిని పట్టగలం అని ఆవిడ సామర్థ్యాన్ని ఆవిడే పరీక్షించుకునేందుకు, అందుకే ఒకటికి పదిసార్లు రిఫర్ చేసి మరీ తీసుకెళ్ళి హెడ్‌క్లర్కుకు సమర్పించా... ఆయన చూస్తూనే...

"ఇదేవిటయ్యా ఈ లీలమ్మ ఎవరయ్యా నీమతి నింతగా పోగొట్టింది" అంటూ గ్రుడ్లురిమాడు.

"కాదండీ..."కమలమ్మ"గారు...నేనారుసార్లు రిఫర్ చేసి మరలతీసుకొస్తేనా! అంటూ దబాయించి, ధైర్యంగా ఆయన చేతిలోని కాగితాన్ని లాక్కుని చూస్తేనిగదా...ఆశ్చర్యం...

"లీలగారూ మీపేరే పడిందండక్కడ. మళ్ళా మరొకకాపీ తీసి ఇచ్చేశాననుకోండి."

"పాపం మీరు నిజంగా ఇంత బాధపడుతున్నారా?" జాలిగా అడిగింది లీల.

"ఊఁ"—అని, గంభీరంగా తలూపి ఇంకా సన్నివేశంలో నిష్క్రమించేయటం యుక్తమని తలచిన రమణరావ్...

"ఇక నేవస్తానండి మరి" అని రెండడుగులేసిన వాడల్లా...గభాల్న ఆగి వెనక్కి తిరిగి...

"ఏమండీ మీ జుత్తుముడి నెప్పుడైనా అద్దంలో చూచుకున్నారా'! దానిలో ఏదో గొప్పరహస్యం ఇమిడిఉన్నట్లుండిగాడు.

లీల చిరునవ్వు నవ్వి "అబ్బేలేదండీ-ముఖం కన్పించినంత స్పష్టంగా కన్పించదది. ఏం" అంది తిరిగి ప్రశ్నిస్తూ.

"అబ్బే మరేంలేదు. క్రిందికి వ్రేళ్ళాడుతున్న జుత్తు నల్లత్రాచులానూ ముడి విప్పిన పడిగలానూ ఆ సాగరం మణిలానూ ఉంది-"

"ఏవిటీ...విషపురుగుతో పోలుస్తున్నారా-" అంది లీల విస్మయపడిపోతూ.

రమణరావు సైతం ఖంగారుపడ్డాడు "అవును, నిగనిగ మెరిసే నల్లత్రాచు ఆకర్షణీయంగా ఉన్నా దాని దరిచేరలేంకా" అనుకుని, నవ్వేస్తూ, "అబ్బే నా ఉద్దేశ్యం ఆకర్షణలో మాత్రం అంటూ ఆదోలా చూచాడు.

"ఓహో...అదా" లీల సైతం ముఖు పర్యారంగా త్రిప్పి అదోలా అతని కళ్ళోకి చూచింది.

లీల కల్పటి ముఖంలోంచి తొంగి చూస్తున్న లావణ్యంతో మనసుని మూటకట్టుకుని ఆనాటికి వెళ్ళిపోయాడు రమణరావ్.

* * *

ఆ మర్నాడే లీలకు ఏదో సంబంధం స్థిరపడి, మరి మూడు రోజుల్లోనే పెండ్లయిపోయింది. అయిన నెలరోజుల్లోనే, భర్తైన కొత్తబ్బాయికి పట్నంలో ఏదో ఉద్యోగం కావడంవల్ల మూటా ముల్లే సర్దుకుని వాటితోబాటు లీలనుకూడా తీసుకుపోయాడు. అటుపైన ఓ సంవత్సరానికి పురుడు పోసుకోడానికి పుట్టింటికొచ్చిన లీల ప్రక్కింటి లలితని వచ్చేరావడంతోనే ఆత్రంగా అడిగింది...

"ఏమే. డి. ఇ. ఓ ఆఫీస్‌లో క్లర్కు రమణరావ్‌గారెలా ఉన్నారే" అని.

"పాపం ఆయనా అదో కలా ఐపోయి చాలా కాలం క్రితం ఈ ఊరు ఒదిలేసి ఎటో వెళ్ళిపోయాడుగా" అంది లలిత. కొన్ని క్షణాలసేపు నిశ్చేష్టురాలై పోయింది లీల. తర్వాత నెమ్మదిగా తేరుకుని.

"అబ్బా...అరచిచిచ్చు రగులుకొంది. స్థిమితంగా బ్రతకటానికి బదులు జీవితంలో దొరకని వస్తువుకోసం జీవితకాలం తీరని వేదనతో, వ్యథ పడక తప్పలేదు" అంటూ రెండు చేతులూ నమ్రతగా కట్టుకుని, వాటిని డ్రాయరుమీదుంచి వాటి మీద ముఖాన్నుంచుకుంది. ★